క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర


కొలువుదీరిన గంగమ్మ

యాదమరి: మండల పరిధిలోని పెరుమాళ్లపల్లెలో గంగమ్మ జాతరను అతి వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు గావించి పుష్పాలంకరణ చేసి వేద పారాయణలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ముందు ఏర్పాటు చేసిన తెర తొలగించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. సాయంత్రం మహిళలు అందరూ పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామంలో సందడి వాతావరణాన్ని సంతరించుకుంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ ఈశ్వర్ పటిష్ట భద్రత కల్పించారు.

సంజయ్ గాంధీనగర్‌లో గంగజాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని సంజయ్ గాంధీనగర్‌లో మంగళవారం గంగజాతర అట్టహాసంగా ప్రారంభమైంది. వేకువజామున అమ్మవారిని కొలువుదీర్చి తొలిపూజ చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అంబలి పోశారు. విశేష పూజలు చేశారు. రాత్రి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అమ్మవారికి గజమాల సమర్పించారు. కర్పూర హారతులు పట్టి దర్శించుకున్నారు. ఆయనకు జాతర పెద్దలు, కార్పొరేటర్ హరిబాబురెడ్డి డప్పు వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. దుశ్శాలువలతో సన్మానించారు. అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు మనోజ్, శేఖర్, బాబులాల్, కార్తీక్, కృష్ణారెడ్డి, బందా రమేష్, అన్బు, ఆను, హరీషారెడ్డి, శాంతి పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి సభ

బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం గ్రామంలో బుధవారం అంబేడ్కర్ జయంతి సభను నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక సభ్యుడు కృష్ణన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి పలువురు దళిత నాయకులు హాజరుకానున్నట్లు కృష్ణన్ తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించేందుకు ప్రభుత్వం సహకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలానికి 200 కుట్టుమిషన్లను మంజూరు చేసినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 75 రోజులపాటు నిర్వహించే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ పాల్గొన్నారు.

జాడ లేని రాయితీ రుణాలు

- అందని బీసీ రుణాలు
- ఆందోళనలో అర్హులు
- రుణాల కోసం ఎదురుచూపులు



గతంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

గుడిపాల: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం రాయితీ రుణాలు మంజూరు చేసింది. అయితే రుణాల మంజూరులో రాజకీయం చోటుచేసుకోవడమే గాక అధికారులు, టీడీపీ నాయకుల మధ్య సమన్వయం లోపించడంతో మంజూరైన రుణాలు అందక అర్హులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయలకతీతంగా అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేశారు. ప్రస్తుతం మండలానికి బీసీ రుణాల కింద 91 యూనిట్లు మంజూరయ్యాయి. మండలంలో 27 పంచాయతీలకు గాను నాలుగు బ్యాంకులు ఉన్నాయి. ఇందులో నంగమంగళం స్టేట్ బ్యాంక్ పరిధిలో బొమ్మసముద్రం, నంగమంగళం, మరకాలకుప్పం, పానాటూరు, గొల్లమడుగు, గట్రాళ్లమిట్ట, మందిక్రిష్ణాపురం పంచాయతీలకు 22 యూనిట్లు కేటాయించారు. గుడిపాల సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో వసంతాపురం, బసవాపల్లె, గుడిపాల, పాపసముద్రం, కొత్తపల్లె, రామభద్రాపురం, చీలాపల్లె, పేయనపల్లె పంచాయతీలకు 24 యూనిట్లు కేటాయించారు. 197రామాపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో కుప్పిగానిపల్లె, కమ్మతిమ్మాపల్లె, సీఎంకండ్రిగ, క్రిష్ణజమ్మాపురం పంచాయతీలకు 23 యూనిట్లు కేటాయించారు. ఎస్‌ఆర్‌పేట సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌కు 22 యూనిట్లు మంజూరయ్యాయి. ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంతవరకు రుణాలు మంజూరు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బీసీ రుణాలు ఇస్తామని అధికారులు ప్రకటించడంతో 620 మంది దాదాపు ఒక్కో దరఖాస్తుకు రూ.400 ఖర్చుపెట్టి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఫిబ్రవరిలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అయితే రాజకీయ నాయకులు అండదండలున్న వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయాలని అధికార పార్టీ నాయకులు మౌఖికంగా ఆదేశించడంతో ఇంతవరకు రుణాలు మంజూరు కాలేదు. దీంతో రాయితీ రుణాలు వస్తే చిన్నపాటి వ్యాపారం పెట్టుకొని జీవనం సాగించాలని ఆశిస్తున్న వారు నిరాశ చెందుతున్నారు. ఎప్పుడు రుణాలు ఇస్తారోనని ఆశగా నిరీక్షిస్తున్నారు. పేదవారు స్వయం ఉపాధి కల్పించుకోవడానికి ప్రభుత్వం అందజేస్తున్న రుణాల విషయంలో రాజకీయ నాయకుల జోక్యంపై అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు అందజేయాలని కోరుతున్నారు.

> **జిల్లా కేంద్రానికి జాబితా పంపించాం**
>
> 
>
> రెండు నెలల క్రితం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి జాబితా సంబంధిత బ్యాంకులకు, జిల్లా అధికారులకు పంపాం. అక్కడి నుంచి మంజూరు జాబితా వస్తే వెంటనే ఎంపిక చేసిన వారికి రుణాలు మంజూరు చేసే చర్యలు చేపడతాం. – కుమార్, ఎంపీడీవో, గుడిపాల

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


అంగన్‌వాడీ పిల్లలకు వైద్యం చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక వైద్యాధికారి కేశవనారాయణ తెలిపారు. మండలంలోని దిగువమోదలపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లలకు, వృద్ధులకు 104 క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్న పిల్లలకు మంచి ఆహారం పెడితే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని కోరారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటే బాగా చదవగలరని అన్నారు. గర్భిణులు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. 104, 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, ఏఎన్‌ఎం లావణ్య, అంగన్‌వాడీ వర్కర్ సావిత్రి, ఆశాకార్యకర్తలు సౌందర్య, నాగభూషణం, పుష్ప, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2న దేవరకొండపై విగ్రహ ప్రతిష్ట

బంగారుపాళెం: మండలంలోని మొగిలి దేవరకొండపై మే 2న శ్రీపార్వతీ సమేత జలకంఠేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ, నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల మధ్య సంకల్పం, అనుజ్ఞ, మహాగణపతి పూజ, స్వస్తివాచనం, వాస్తుహోమం, లఘుపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి గణపతి పూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, కలశారాధనలు, అభిషేకం, నక్షత్ర, నవగ్రహ శాంతి హోమాలు, సర్వదేవతా హోమాలు, రుద్రహోమం, సాయంత్రం 4 గంటలకు గోపూజ, అంకురార్పణ, పంచగవ్యము, భూతశుద్ధి పూర్ణాహుతి, లలితా సహస్రనామము జరుగుతాయన్నారు. 2వ తేదీ శుక్రవారం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, గణపతి పూజ, పుణ్యాహవచనం, వేదికార్చన, రుద్ర, చండీ హోమాలు, స్పర్శశాంతి, నేత్రోన్మీలనం, కళాహోమం, సాయంత్రం 5 గంటలకు పార్వతీదేవి సమేత జలకంఠేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్, ధనంజయరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్
- పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం

కాణిపాకం/యాదమరి: ఆచరణ సాధ్యం కాని తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కూటమి సర్కార్ అనతి కాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుందని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డా.సునీల్ కుమార్ అన్నారు. ఆయన మంగళవారం జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డితో కలిసి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న చిన్నిరెడ్డి పల్లి ముస్లింవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమానులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని తన అభిమానాన్ని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన ఆదిల్(19)పై టీడీపీ మూకలు దాడి చేసి గాయపరిచారు. దీనిని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ అభిమానులు ఐదుగురిపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అని తెలిపారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కక ముందు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఇతర పార్టీ నేతలకు నీతులు చెప్పిన నేతలు ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. తప్పుడు వాగ్దానాలతో అధికారాన్ని చేపట్టిన కూటమిని, వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తోందనే ఇలా దాడులకు తెగబడుతోందని దుయ్యబట్టారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజల తరఫున ధైర్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు. కష్టాల నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, అధికారంలో లేనంత మాత్రాన ప్రజల పక్షాన పోరాడడంలో ఎప్పుడు వెన్ను చూపమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మనోహర్, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, నరేష్, వరాలు యాదవ్, ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

> **భయపడొద్దు భవిష్యత్ మనదే!**
>
> ప్రజలు అధికారాన్ని ఇచ్చింది ప్రజలకు సేవ చేయడానికే కానీ ఇలా బెదిరింపులు, దాడులకు దిగడానికి కాదని జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి హితవు పలికారు. ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం కోల్పోకుండా ఉండాలని సూచించారు. కూటమి బెదిరింపులకు అధైర్యపడకుండా ప్రజల పక్షాన పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యకర్తలెవరూ భయపడొద్దని, భవిష్యత్తు మనదే అని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. అనంతరం తీవ్రంగా గాయపడిన సిద్ధిక్ అనే యువకుడిని పరిశీలించి తన కంటిలోని రెటీనా దెబ్బతిందని డాక్టర్ సునీల్‌కుమార్ గుర్తించారు. అతనిని అరవింద్ కంటి ఆస్పత్రికి రిఫర్ చెయ్యాలని ప్రభుత్వ వైద్యులకు సూచించారు. ఇదే విషయమై బుధవారం ఎస్పీని కలవనున్నట్లు వెల్లడించారు.

లోదుక్కులతో కలుపు నివారణ

- సూక్ష్మజీవులు, వానపాములకు దన్ను
- ఖరీఫ్ సాగుకు ఇదే అనుకూలం


ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

గుడిపాల: వేసవిలో చేసే లోదుక్కులతో రైతులకు అన్నీ లాభాలేనని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. వేసవి దుక్కులతో సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుందని, తద్వారా భూసార అభివృద్ధికి తోడ్పతాయని చెప్పారు. కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చని అన్నారు.

పొరల్లోని పురుగుల సంహారం

భూమిలో ఏ పంట వేయకుండా ఉంచడంతో కలుపు మొక్కలు పెరిగి భూసారానికి నష్టం కలుగజేయడంతో పాటు చీడపీడలకు ఆశ్రయం కల్పిస్తాయి. మొండి జాతికి చెందిన తుంగ అన్నిరకాల భూముల్లోను ఎదుగుతుంది. బహువార్షిక వేర్లలో ఆహారాన్ని నిల్వ చేసుకొని భూసారాన్ని దెబ్బ తీస్తుంది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల వీటిని నివారించవచ్చు. పంటకాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడంవల్ల పంటలను ఆశించే చీడపురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు దున్నడం వల్ల వేరుశనగ, చెరకు, పండ్ల తోటలను ఆశించే లద్దెపురుగు, బొంతపురుగు, పచ్చపురుగు భూమిపొరల్లో దాగిన చీడపురుగుల గుడ్లు, కోశాలు వెలుపలకు వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయట పడిన వీటిని కొంగలు, పక్షులు తినడంతో పంటలకు చీడపురుగుల బాధ తప్పుతుంది.

వర్షాకాలానికి ముందే దుక్కులు దున్నాలి

వర్షాకాలం రాకముందే భూమిని మూడు దుక్కులు దున్నాలి. ఇలా చేయడం వల్ల తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్లు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా అడ్డంగా దున్నుకుంటే వర్షపునీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వచేసే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించవచ్చు. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్ట్ ఎరువులు, చెరువు మట్టిని వేయాలి. దీంతో భూమి సారవంతం అవడమే కాకుండా తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూములను వృథాగా వదిలివేయడం వల్ల పొరలు గట్టి పడతాయి. పంటలు వేసిన సమయంలో నారు సరిగ్గా చొచ్చుకుని పోదు. దీంతో పోషక పదార్థాలు సరిగ్గా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల భూమి గుల్లగా మారుతుంది. భూమిలో నీటినిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార అభివృద్ధికి తోడ్పడతాయి.

> **భూమిని వదిలేయవద్దు**
>
> పంటలసాగు పూర్తయ్యాక రైతులు తమ వ్యవసాయ భూములను వదిలేస్తుంటారు. ఇలా చేయడం వలన కలుపుమొక్కలు పెరిగే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. అవి భూమిలోని పోషకాలను స్వీకరించడమే కాకుండా భూమిలో లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతిని ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం చూపుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీ పంట చేతికందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల అధిక ప్రయోజనాలు ఉంటాయి. సమగ్ర సస్య రక్షణలో వేసవి దుక్కులకు చాలా ఉపయోగపడతాయి.

కలిగిరికొండ గోవులకు పశుగ్రాసం

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలం పేటపల్లి శ్రీ సన్నిధి ఫుడ్స్ మంగళవారం కలిగిరి కొండలోని గోవులకు పశుగ్రాసం అందించింది. రూ.30వేలు విలువ చేసే మూడు లోడ్ల పశుగ్రాసం అందజేశారు. కార్యక్రమంలో ఈడీ శంకర్‌నాయుడు, కమలాకర్‌నాయుడు, కుమారస్వామి, ప్రకాష్, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిత్తూరు అర్బన్: మతిస్థిమితం లేని ఓ మహిళ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని మంగళవారం మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు నగరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మతిస్థిమితం లేని మహిళ(40) పాకుతూ రోడ్డు దాటుతోంది. ఈక్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొని సంఘటన స్థలంలో మృతి చెందింది. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పింక్ రంగు దుస్తులు ధరించి కుడి దవడపైన పెద్ద మచ్చ ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9491074515 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

గణనాథుని సేవలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు


స్వామి చిత్రపటం అందుకుంటున్న రాజపక్స

కాణిపాకం: శ్రీలంక మాజీ అధ్యక్షుడు రాజపక్స మంగళవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. రాజపక్సకు ఆలయ ఏఈఓ రవీంద్ర స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

15 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 15 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. చిత్తూరు నగరంలో సోమవారం చేపట్టిన తనిఖీల్లో 15 మంది మద్యం సేవించి వాహనం నడిపినట్లు గుర్తించామన్నారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌కోర్టులో మంగళవారం హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని పేర్కొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలి



హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది నుద్దేశించి మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కిశోరి వికాసంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సీడీపీఓ శ్యామ్‌సుగుణ కుమారి, హెల్త్ ఆఫీసర్ లోకేష్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్ అన్నారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మెప్మా సిబ్బంది హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కిశోరి వికాసం లక్ష్యంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ఆత్మ రక్షణ, నైపుణ్యం, ఉపాధి తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విధిగా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రేమ పేరుతో వంచనకు గురికావద్దు

యాదమరి: కిశోరి బాలికలు ప్రేమపేరుతో వంచనకు గురి కాకుండా తమ ఉజ్వల భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఎంపీడీవో వేణు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసంపై సంబంధిత సిబ్బందికి వేసవికాల శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కిశోరి వికాసంపై ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. నిత్యం ప్రజలతో మమేకమై బాలికల్లో కౌమారదశలో వచ్చే మార్పుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించాలని శిక్షణకు హాజరైన సిబ్బందికి సూచించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి రుక్మిణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని గుర్తుపెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లోని కిశోరి బాలలను చైతన్యవంతులు చేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా లీగల్ అడ్వైజర్ వెంకటేష్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, హెల్త్ సూపర్ వైజర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల రక్షణకే కిశోరి వికాసం

బంగారుపాళెం: బాలికల సంరక్షణ కోసమే కిశోరి వికాసం అని బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణి శ్రీదేవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం కిశోరి వికాస్ కార్యక్రమంపై మండల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, కిశోరి వికాసం అనే కార్యక్రమాన్ని 2017లో ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. బాల్యవివాహాలు, అక్రమ రవాణా, రుతుక్రమ సమస్యలపై అవగాహన, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలు, వృత్తిమార్గ నిర్దేశన, జీవన నైపుణ్యాలు, లైంగిక దాడుల నుంచి బాలికలను రక్షించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, సంఘమిత్రలు గ్రామస్థాయిలో కిశోరి బాలవికాసంపై చైతన్యం కలిగించాలని సూచించారు. బాల్యవివాహాలు, లైంగిక దాడుల నుంచి ఎలా రక్షణ పొందాలనే విషయాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవి, సీసీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


కిశోరి వికాసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కిశోరి వికాసంతోనే ఉజ్వల భవిష్యత్

గుడిపాల: ఉజ్వల భవిష్యత్ కిశోరి వికాసంతోనే సాధ్యమవుతుందని ఎంపీడీవో కుమార్, ఎంఈఓ గణపతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా బాలికల్లో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యంపై దృష్టి సారించేలా ఉండాలన్నారు. బాల్య వివాహాలను నివారించడానికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పౌష్టికాహారం తప్పనిసరి అని వారు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సంధ్య, రష్మిత, సూపర్‌వైజర్లు తోయాద్రాక్షి, స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.